ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శనివారం 16 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శనివారం సాయంత్రం: 6.32 గం.

సహర్ : ఆదివారం ఉదయం: 5.01 గం.

తీన్‌మార్!

లోక్‌సభ ఎన్నికల రూపంలో మళ్లీ ఓట్ల పండగ వచ్చేస్తున్నది. రాష్ట్రంలోని చాలా జిల్లాలు ఒకే పార్లమెంటు స్థానం పరిధిలో ఉన్నాయి. కొన్ని జిల్లాల పరిధిలో రెండేసి ఎంపీ స్థానాలు విస్తరించాయి. కానీ, సిద్దిపేట జిల్లాకు అనుబంధంగా మూడు లోకసభ స్థానాలు ఉండడంతో జిల్లా రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకు మూడు పార్టీలు ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో ఓటర్లు ఎవరివైపు మొగ్గుజూపుతారన్న చర్చ ప్రారంభమైంది.



- జిల్లా పరిధిలో మూడు ఎంపీ స్థానాలు
- మెదక్, కరీంనగర్, భువనగిరిలో అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ
- ప్రస్తుతం బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రతినిధుల ప్రాతినిథ్యం
- సిట్టింగ్‌లను కాపాడుకునేందుకు పార్టీల ప్రయత్నం
- ఇప్పటికే ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజల్లోకి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 15: నేడు పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్న దృష్ట్యా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి వందరోజులు పూర్తయిన వెంటనే మళ్లీ లోక్‌సభ ఎన్నికలు తెరమీదకు వచ్చాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా అధికార మార్పిడి జరగడంతో సమీకరణాలన్నీ తారుమారవుతున్నాయి. ఫలితంగా పార్లమెంటు ఎన్నికలు ఉత్కంఠగా మారాయి. ఇక రాష్ట్రంలో ఏ జిల్లాకు లేని విధంగా మూడు లోక్‌సభ స్థానాలతో సిద్దిపేట జిల్లాకు ముడిపడి ఉండడం వల్ల మరింత ఆసక్తిని కలిగిస్తోంది.

అభ్యర్థుల ఎంపికలోనూ ఆచితూచి అడుగులు

ఇప్పటివరకు మూడు స్థానాలకు సంబంధించి పూర్తి స్థాయిలో అభ్యర్థులను ఏ పార్టీ ప్రకటించలేదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నడుమ త్రిముఖ పోటీ కొనసాగుతున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మెదక్‌లో కేవలం బీజేపీ అభ్యర్థిగా మాధవనేని రఘునందన్‌రావును ప్రకటించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంలో తర్జనభర్జన పడుతున్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వంటేరు ప్రతాప్‌రెడ్డి వైపే అధిష్ఠానం మొగ్గు చూపినట్లుగా తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మల, నీలం మధు పేర్లు వినిపిస్తున్నాయి. కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్ కుమార్ పేర్లను ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా తేల్చలేదు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పేర్లు చర్చకొస్తున్నాయి. భువనగిరిలో సైతం బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను నేటికీ ప్రకటించలేదు. నేడు షెడ్యూల్ విడుదలవుతున్న క్రమంలో రాజకీయ సమీకరణాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉండనున్నట్లు తెలుస్తోంది.

సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకునేలా

2009, 2014, 2014 ఉప ఎన్నికలు, 2019 ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ స్థానాన్ని బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. వరుసగా నాలుగు ఎన్నికల్లోనూ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. 2009లో విజయశాంతి, 2014లో కేసీఆర్, 2014 ఉప ఎన్నికతోపాటు 2019 ఎన్నికల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎంపీలుగా గెలిచారు. ఇప్పుడు జరగనున్న ఎన్నికల్లోనూ ఈ స్థానాన్ని నిలబెట్టుకునేలా బీఆర్‌ఎస్ వ్యూహరచన ప్రారంభించింది. మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ బాధ్యతలను తన భుజానెత్తుకున్నారు. ఇక కరీంనగర్ పార్లమెంటుకు సంబంధించి 2009లో కాంగ్రెస్ నుంచి పొన్నం ప్రభాకర్, 2014లో బీఆర్‌ఎస్ తరఫున బోయినపల్లి వినోద్‌కుమార్, 2019లో బీజేపీ నుంచి బండి సంజయ్ విజయం సాధించారు. భువనగిరి లోక్‌సభ స్థానంలో 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, 2014లో బీఆర్‌ఎస్ తరఫున బూర నర్సయ్యగౌడ్, 2019లో కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపొందారు. ప్రస్తుతం మెదక్‌లో బీఆర్‌ఎస్, కరీంనగర్‌లో బీజేపీ, భువనగిరిలో కాంగ్రెస్ పార్టీలు ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. ఈ సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకోవడానికి ఆయా పార్టీలు నిమగ్నమయ్యాయి. అంతేగాకుండా తమ స్థానంతోపాటు మిగిలిన రెండుస్థానాలనూ దక్కించుకోవడానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ ప్రయత్నాలను ప్రారంభించాయి.

లోక్‌సభ స్థానాల్లోని మండలాలు

మెదక్ లోక్‌సభ(18 మండలాలు): సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, చిన్నకోడూరు, నంగునూరు, దుబ్బాక, మిరుదొడ్డి, అక్బరుపేట-భూంపల్లి, తొగుట, రాయపోల్, దౌల్తాబాద్, గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కూక్, ములుగు, వర్గల్, కొండపాక, కుకునూరుపల్లి.

కరీంనగర్ లోక్‌సభ (4 మండలాలు): హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి.

భువనగిరి లోక్‌సభ (4 మండలాలు): చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూలిమిట్ట.



గెలుపే లక్ష్యంగా కార్యక్రమాలు

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిల్లాలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రేసులో ఉన్న వంటేరు ప్రతాపరెడ్డి ఇటీవల మహాశివరాత్రి సందర్భంగా లోక్‌సభ పరిధిలోని ఓటర్లందరికీ ఫోన్ ద్వారా సందేశాలు పంపించారు. వాయిల్ మెసేజ్‌లు చేరవేశారు. పలుచోట్ల మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును ఇటీవలే ప్రకటించడంతో ఆయన కూడా ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. గతంలో ఎంపీగా పోటీ చేయడం, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవాలను రంగరిస్తున్నారు. కరీంనగర్ బీజేపీ అభ్యర్థిగా ఉన్న బండి సంజయ్ ఇటీవలే జనహిత యాత్రను చేపట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి పార్లమెంటు ఎన్నికల్లో మద్దతు ప్రకటించాలని కోరారు. ఇటీవల హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన బీఆర్‌ఎస్ మీటింగ్‌ను నిర్వహించగా ఆ పార్టీ అభ్యర్థి వినోద్‌కుమార్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

గురుకుల మహిళా
కళాశాలల్లో ప్రవేశాలు

- విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ మను చౌదరి



గురుకుల మహిళా కళాశాలల్లో ప్రవేశం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 15: తెలంగాణ గురుకుల మహిళా కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గురుకులాల్లో ప్రవేశం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన, మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల సంస్థల ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 12 చివరి తేదీ అని, ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త నిర్మల, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ ఎండి రిజ్వాన, అధ్యాపకులు వనజ, ఉమాదేవి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై పట్టింపేదీ?



- నీరుగారుతున్న సాగు లక్ష్యం
- బీఆర్‌ఎస్ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధుల హడావిడి
- ఇప్పుడు ఒక్క సమావేశం నిర్వహించని వైనం
- సాగుకు దూరమవుతున్న రైతులు

గజ్వేల్, మార్చి 15: ఆయిల్‌పామ్ సాగుపై గత రెండేళ్లుగా జిల్లా యంత్రాంగం హడావిడి చేసింది. బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాలో భారీగా ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పెద్ద ఎత్తున కసరత్తు చేశారు. గ్రామాల్లో, రైతువేదికల్లో, మండల కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో ఎక్కడికక్కడ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి రైతులను ఆయిల్‌పామ్ వైపు మళ్లించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేసి కొంత మేర సఫలీకృతం అయ్యారు. వాస్తవానికి భారీగా టార్గెట్‌ను విధించుకున్నా ఆశించిన స్థాయిలో లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. గత రెండేళ్లలో ఎంతో కొంత మేర టార్గెట్‌ను అందుకున్నా, ఈ యేడు పూర్తిస్థాయిలో టార్గెట్‌కు దూరమయ్యారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 11వేల 300ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేసిన రైతులు ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమనే అంటున్నారు. వాస్తవంగా 14వేల 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులకు కనీసం ఆ మార్క్ చేరుకునేందుకు ప్రయత్నాలు చేయలేదు. ఫలితంగా కేవలం 2,900 ఎకరాలకే ఆయిల్‌పామ్ పరిమితమైంది.

అందుబాటులోకి రానున్న ఫ్యాక్టరీ

దేశంలోనే అతిపెద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ జిల్లాలో అందుబాటులోకి రానుంది. రూ.300 కోట్ల వ్యయంతో నంగునూరు మండలం నర్మేట్ట గ్రామంలో ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగును పెంచాల్సిన అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆయిల్‌పామ్‌ను సాగు చేసిన రైతులు, ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలనుకుంటున్న రైతులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. మంచి కమర్షియల్ పంట అయిన ఆయిల్‌పామ్ వైపు రైతులను మళ్లిస్తే 30ఏళ్ల వరకు రైతులకు ఏటా ఆదాయం దండిగా రావడంతో పాటు అతివృష్టి, అనావృష్టితో సంబంధం లేకుండా రైతులు బయటపడే అవకాశాలు ఉన్నాయన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టారు. అంతేకాకుండా ప్రత్యేక జీవో ద్వారా ఈజీఎస్‌ను ఆయిల్‌పామ్ రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫలితంగా పదివేల ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్‌ను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపారు.

రైతులను ప్రోత్సహించడంలో అధికారులు విఫలం

గతేడాది మాదిరిగా అధికారులు ఆయిల్‌పామ్ వైపు రైతులను మళ్లించే కసరత్తు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా 14వేల 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అధికార యంత్రాంగం ఆ దిశగా రైతులను జాగృత పరచడం, పురమాయించడంలో విఫలమయ్యారు. ఫలితంగా కేవలం 2,900 ఎకరాలకే ఆయిల్‌పామ్ సాగు ప్రస్తుత ఏడాదికి పరిమితమైంది. గతేడాది ఏఈవోల నుంచి మొదలుకుని ఏవోలు, వ్యవసాయశాఖ ఏడీలు, జిల్లా వ్యవసాయాధికారి, హార్టికల్చర్ అధికారి, ఆయిల్‌పామ్ జిల్లా అధికారితో పాటు గ్రామీణాభివృద్ధి అధికారులు ఎక్కడికక్కడ సమావేశాలను ఏర్పాటు చేసి రైతులను ఆయిల్‌పామ్ వైపు మళ్లించారు. ప్రస్తుతానికి 2,900 ఎకరాల్లో పంటను సాగు చేయడంతో పాటు మరో 3వేల ఎకరాలకు సంబంధించిన డీడీలను చెల్లించారు.

సమీక్షించే నాథుడే కరువు

గతేడాది నెలనెల రిపోర్టులను అడిగిన అధికార యంత్రాంగం ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటుతున్నా ఇప్పటివరకు ఆయిల్‌పామ్ విషయమై సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. అంతేకాకుండా అధికార యంత్రాంగం సైతం ఆయిల్‌పామ్ లక్ష్యం, సాగు చేస్తున్న రైతుల పరిస్థితి, వారికి అందుతున్న సబ్సిడీలు, ఇతరత్రా సౌకర్యాలను గూర్చి సమావేశాలను జరపడం లేదు. ఫలితంగా ఇప్పటికే ఆయిల్‌పామ్‌ను సాగు చేసిన రైతులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆయిల్‌పామ్‌పై సమీక్ష నిర్వహించాలని రైతులు కోరుకుంటున్నారు.



అక్కారంలో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



- అక్షరాలకు నోచుకోని వారు కొందరు..
- చదువుతూ పని చేసేవారు మరికొందరు
- పట్టించుకోని అధికారులు
- కరువైన అవగాహన సదస్సులు
- ఎనిమిదేళ్లలో 722 మంది బాల కార్మికుల గుర్తింపు

బతుకు భారం.. బాల్యం ఛిద్రం

పనిలో బాల కార్మికులు

సిద్దిపేట అర్బన్, మార్చి 15: నేటి బాలలే రేపటి పౌరులు అన్న మాట జిల్లాలో కేవలం సూక్తికి మాత్రమే సరిపోతున్నది. నేటి బాలలే రేపటి కార్మికులు అన్న మాట నిజమవుతున్నది. అక్షరాలు దిద్దాల్సిన బాల్యం అంట్లు తోమడంలో, పొట్లాలు కట్టడంలో బిజీ అయిపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అనాథ పిల్లలు బాల కార్మికులుగా మిగిలిపోతున్నారు. బాలలను పనిలో పెట్టుకోవద్దని చట్టాలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. తమ పిల్లలను బడులకు పంపకుండా కొందరు తల్లిదండ్రులు తాము పనిచేసే చోటికే తీసుకెళ్లి బాల కార్మికులుగా తయారు చేస్తున్నారు.

నామమాత్రంగానే ఆపరేషన్ స్మైల్-ముస్కాన్

బాల కార్మికులను గుర్తించేందుకు ఆపరేషన్ ముస్కాన్ అనేది ఏటా జూలై నెలలో నిర్వహించాలి. ఆపరేషన్ స్మైల్ అనేది జనవరిలో నిర్వహించాలి. అధికారులు మాత్రం నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలతో బాల కార్మికులను గుర్తించి, బడికి పంపించాల్సిన అధికారులు ఫొటోల కోసం మాత్రమే కార్యక్రమాలు నిర్వహించడం గర్హనీయం.

ఈ ఏడాది 81మంది గుర్తింపు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా గడిచిన ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ పేరిట 722 మంది బాల కార్మికులను మాత్రమే గుర్తించారు. వారిలో అనాథ పిల్లలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేక పనిచేస్తున్న పిల్లలను, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు 81మంది బాల కార్మికులను గుర్తించారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం

జిల్లాలో బాల కార్మికులను గుర్తించడంలో, బాల కార్మికులు పనిచేస్తున్న చోట సంబంధిత యజమానులపై చర్యలు తీసుకోవడంలో లేబర్ యాక్ట్ పూర్తిగా విఫలమైంది. అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడంలో బాల కార్మికులకు చదువుల పట్ల ఆసక్తి కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. సిద్దిపేట జిల్లా లేబర్ కార్యాలయం పేరుకు మాత్రమే ఉన్నదా, అసలు అందులో సిబ్బంది పని చేస్తున్నారా లేదా అనే సందేహం కల్గిస్తున్నది. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన అధికారులు బాల కార్మికులను చూసి కూడా చూడనట్టుగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించి అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడంలో కూడా అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

నాకూ చదువుకోవాలని ఉంది

నాకూ చదువుకోవాలని ఉంది. బాగా చదువుకొని గొప్ప వాడిని కావాలని ఉంది. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు నేను పని చేయడానికి కారణమయ్యాయి. పనిచేస్తున్నప్పుడు ఎవరు కూడా మా వద్దకు వచ్చి చదువుకోవాలని చెప్పలేదు. అధికారులు మాకు ఎటువంటి అవగాహన కల్పించలేదు.

- పవన్, బాలకార్మికుడు



సిద్దిపేటలోని లేబర్ కమిషనర్ ఆఫీస్



సిద్దిపేట రూరల్ మండలంలోని హనమంత్‌పల్లిలో గేదెకు టీకా వేస్తున్న పశువైద్యురాలు చందన

పశువులకు టీకాలు

- నెలరోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు
- గాలికుంటు వ్యాధి సోకుండా ముందస్తు చర్యలు
- పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏటా రెండుసార్లు పంపిణీ

సిద్దిపేట రూరల్, మార్చి 15: పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించే లక్ష్యంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు నెలరోజుల పాటు టీకాలు వేయనున్నారు. వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాలను పంపిణీ చేస్తున్నది. కార్యక్రమంలో భాగంగా పశు వైద్య సిబ్బంది స్వయంగా ప్రతి గ్రామానికి వెళ్లి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తారు. అన్ని గ్రామాల్లో దశల వారీగా వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసిన ప్రతీ పశువు చెవుకు పోగులు వేసి, ట్యాగ్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

టీకాలతో వ్యాధి నిరోధక శక్తి

పశువులకు సోకిన గాలికుంటు వ్యాధిని సకాలంలో గుర్తించి నివారించుకోవడం మినహా పూర్తిగా నిర్మూలించేందుకు మందులు లేవు. వ్యాధి సోకిన పశువుకు 14నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి వద్ద, కాలి గిట్టల వద్ద బొబ్బలు ఏర్పడతాయి. దీంతో నడవడానికి, మేత మేయడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. బాగా నీరసించిపోవడం, పాల దిగుబడి తగ్గిపోవడం, పని సామర్థ్యం తగ్గిపోవడం జరుగుతుంది. వ్యాధి సోకిన పశువుల్లో 5శాతం చనిపోతుండడంతో ఆర్థికంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరంలో రెండుసార్లు ఉచితంగా టీకాలు అందిస్తున్నది. ఈ టీకాల వల్ల పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి, వర్షకాలంలో గాలికుంటు వ్యాధితో పాటు ఇతర వ్యాధులు సోకకుండా పశువులకు రక్షణగా ఉంటుంది.

పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి



పశువుల్లో వస్తున్న వ్యాధుల నివారణకు ఏర్పాటు చేస్తున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 15నుంచి ఏప్రిల్ 15వరకు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. అన్ని పశు వైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. టీకాలను ఉచితంగా ప్రభుత్వమే అందిస్తున్నది.

- చందన, మండల పశువైద్యదికారి, సిద్దిపేట రూరల్



ముద్దుగుమ్మలే దిష్టిబొమ్మలు..

చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామ శివారులో రంగనాయక సాగర్ దిగువన ఉన్న పొలంలో చంద్రమౌళి అనే రైతు మిర్చి పంటకు దిష్టి తగలకుండా సినీ తారల చిత్రపటాలను పెట్టాడు. ఇది వింతగా ఉన్నా పంట దిగుబడికి మేలు చేస్తుందని చుట్టుపక్కల రైతులు తెలిపారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



చెక్ పోస్టులను పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

కోహీర్ మార్చి 15: కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రెండు చెక్ పోస్టులను జహీరాబాద్ ఆర్డీవో రాజు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రవి శుక్రవారం పరిశీలించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి గ్రామ శివారులో ఒక చెక్ పోస్టును, సిద్ధాపూర్‌తండా గ్రామ శివారులో మరో చెక్ పోస్టును ఏర్పాటు చేశామని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, డబ్బులు రవాణా కాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఈ చెక్ పోస్టుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసి వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామన్నారు. వీరి వెంట కోహీర్ తహసీల్దార్ బాలశంకర్, ఆర్ఐ సత్యనారాయణ, పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మనియార్‌పల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

కొనసాగుతున్న రాచన్నస్వామి జాతర

కోహీర్, మార్చి 15: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి జాతర వైభవంగా కొనసాగుతున్నది. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన మంగళహారతి, అగ్నిపూజ (అగ్గితొక్కుడు), భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



అగ్గి తొక్కుతున్న భక్తులు

ఘనంగా శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవం

రామచంద్రాపురం, మార్చి 15: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమల గ్రామంలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయ బ్రహ్మోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, సుచరితకొమురయ్య స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలి

పెద్దశంకరంపేట, మార్చి 15: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలని ఆలయ కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి ఆలయం వద్ద విగ్రహ పునః ప్రతిష్ఠాపనకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గ్రామ పెద్దల చేతులమీదుగా ఆవిష్కరించారు.

విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలనలోకి

8 వంద రోజుల్లో ఐదు గ్యారెంటీలకు శ్రీకారం: పొంగులేటి



హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలనలోకి వచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను దారిలో పెడుతూ లక్ష్యం దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన శక్తినంత కూడగట్టుకుంటూ ఒక్కో అడుగు వేసుకుంటూ విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను శరవేగంగా అమలు చేస్తూ వంద రోజుల్లోనే 5గ్యారెంటీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

టీజీ సిరీస్‌తో తొలిరోజే 2.51 కోట్ల ఆదాయం

కొత్త కోడ్ టీజీ సిరీస్‌తో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రారంభమయిన తొలిరోజే రవాణాశాఖ ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం చేకూరింది. టీజీ సిరీస్ ఫ్యాన్సీ నెంబర్లకు అనూహ్య పోటీ నెలకొనడంతో ఒక్కరోజులో రూ.2,51,86,437 ఆదాయం చేకూరింది. ఇంతకాలం టీఎస్‌గా ఉన్న వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ శుక్రవారం నుంచి టీజీగా మారింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రవాణా కార్యాలయాలో 0001 నుంచి కొత్త సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. 33 చోట్ల మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ ద్వారా టాక్స్ రూపంలో రూ.1,25,11,000, ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనయజమానుల పోటీ ద్వారా అదనంగా రూ.1,26,75,437 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి రూ.51,06,618 ఆదాయం రాగా ఇందులో సాధారణ టాక్స్ రూపంలో రూ.19,64,000, ఫ్యాన్సీ నెంబర్లపై పోటీద్వారా రూ.31,42,618 వచ్చినట్లు అధికారులు వివరించారు.

మంత్రి కోమటిరెడ్డికి హైకోర్టులో ఊరట



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఉన్న రెండు వేర్వేరు కేసులను కొట్టేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2018లో కొత్తగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయంలోకి తన అనుచరులతో అక్రమంగా ప్రవేశించి.. గొడవ చేశారని పేర్కొంటూ అప్పటి నల్గొండ ఆర్డీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో కోమటిరెడ్డిని దోషిగా గుర్తించిన ప్రజాప్రతినిధుల కోర్టు ఆయనకు రూ.4,200 జరిమానా విధించింది. దీనిపై ఆయన అప్పీల్ చేయగా.. ఎలాంటి ఆధారాలు లేకపోవడం హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఇటు జనరల్ బాడీ మీటింగ్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘించి..అవమానానికి గురిచేశారని పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అప్పటి ఎంపీపీ కొప్పుల కృష్ణయ్య కనగల్ పోలీస్ స్టేషన్‌లో 2014లో ఫిర్యాదు చేశారు. సదరు ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోమటిరెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సదరు క్వాష్ పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు.. కనగల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేస్తూ తుది తీర్పు జారీ చేసింది.

22 నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 3 నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ మాట్లాడుతూ...ప్రతి నెల ఒకటో తేదీన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఎన్‌హెచ్‌ఎం విధులు బహిష్కరిస్తామన్నారు. ఈనెల 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నో వర్క్, నో పే కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు.

481 మంది ఫైర్‌మెన్లకు శిక్షణ ప్రారంభం

అగ్నిమాపక శాఖలో 481 మంది ఫైర్‌మెన్లకు శిక్షణ ప్రారంభమైంది. ఫైర్‌మెన్ పోస్టుల భర్తీకి పోలీస్ నియామక బోర్డు నిర్వహించిన పరీక్షలో 534 మంది అర్హత సాధించగా, వారిలో 481 మంది మాత్రమే రిపోర్టు చేశారు. దాంతో ఆ 481 మందికి అగ్నిమాపకశాఖ అకాడమీలో ఏడీజీ నాగిరెడ్డి శిక్షణాతరగతులను ప్రారంభించారు. నాలుగు నెలల శిక్షణ అనంతరం వీరు విధుల్లో పాల్గొంటారని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ విధానంలో పలు మార్పులు చేశామని నాగిరెడ్డి తెలిపారు.

సింగరేణిలో 986 ఇంటర్నల్ పోస్టుల భర్తీ

కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా భూగర్భ గనుల్లో పని చేస్తున్న విద్యావంతులైన యువ కార్మికులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేందుకు వీలుగా వివిధ విభాగాల్లో ఏర్పడిన 986 ఖాళీల భర్తీకి సింగరేణి నిర్ణయం తీసుకుంది. దీనికోసం సంస్థలోని ఇన్ సర్వీస్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రెండు ఇంటర్నల్ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ పోస్టుల్లో 204 అధికార హోదా పోస్టులు కాగా, 782 టెక్నీషియన్, కార్మిక స్థాయి పోస్టులున్నాయి.

ఆర్ అండ్ బీ ఈఎన్‌సీగా పీ సతీష్

రోడ్లు, భవనాలు(ఆర్ అండ్ బీ) శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)గా పీ సతీష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 నుంచి 2024 వరకు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన సతీష్ ఇప్పుడు ఈఎన్‌సీగా పదోన్నతి పొందారు. అనేక జిల్లాల్లో పనిచేసిన ఆయన వరుసగా ఏడేళ్ల పాటు బెస్ట్ ఇంజనీర్‌గా అవార్డు అందుకున్నారు.

కార్పొరేట్‌కు విలువలు తాకట్టు పెట్టిన బీజేపీ:ఒవైసీ

నైతిక విలువలను ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ రూ.ఆరువేల కోట్లకు పైగా సేకరించడమే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మక్కా మసీదులో పవిత్ర రంజాన్ మొదటి శుక్రవారం ప్రార్థనల అనంతరం మౌముల్ ఖురాన్ కార్యక్రమంలో ఒవైసీ ప్రసంగించారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరిట మజ్లిస్ పార్టీ విరాళాలు వసూలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. మోదీ తాను లంచం తీసుకోనని, ఎవ్వరినీ తీసుకోనివ్వనని చెబుతున్నారని, అయితే బాండ్లు ఇస్తే తప్ప ఆయన అసలు లంచాలు తీసుకోరా? అని ఎద్దేవా చేశారు. 2019 నుంచి బీజేపీతో పాటు టీఎంసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ తదితర రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కార్పొరేట్ సంస్థలు, ప్రముఖుల నుంచి రూ.12,769 కోట్లు విరాళాలుగా సేకరించినట్టు ఎస్‌బీఐ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

శని, ఆదివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. పలు జిల్లాల్లో పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటేశాయి. శుక్రవారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 40.9 డిగ్రీలు, నల్గొండ జిల్లా మాడ్గులపల్లి, గద్వాల జిల్లా వాడపల్లి, అలంపూర్‌లతో పాటు నిజామాబాద్‌లో 40.7 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా కీర్తవారిగూడెంలో 40.6 డిగ్రీలు, వనపర్తి జిల్లా కేతేపల్లి, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, ఖమ్మం జిల్లా గుబ్బగుర్తి, సూర్యాపేట జిల్లా అలుగునూర్‌లో 40.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో ప్రొఫెసర్ కోదండరామ్, ఐపీఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈ నెల 10న రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పరిష్కరించే దిశగా సలహాలు, సూచనలతో నివేదికను అందజేయాలని కమిటీకి ముఖ్యమంత్రి సూచించారు.

ఆదాయ మార్గం ఉన్నా.. ఆలోచన శూన్యం

- డిజైన్‌కు ఇచ్చిన ప్రాముఖ్యత.. అభివృద్ధిపై లేదు
- కోట్లు విలువచేసే భూమి మార్కెటింగ్‌శాఖకు అప్పగింత
- మునిసిపాలిటీకి ఆదాయం వస్తే మరింత అభివృద్ధి
- మహతి ఆడిటోరియం సైతం టూరిజంశాఖకు అప్పగింత
- కొత్త ప్రభుత్వంలోనైనా మార్పు వచ్చేనా...?



గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్

గజ్వేల్, మార్చి 15: పట్టణాభివృద్ధికి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా.. డిజైన్ పోతుందనే ఆలోచనకే ప్రాధాన్యం ఇచ్చారు. పట్టణ నడిబొడ్డున ఉన్న జూనియర్ కళాశాల, బస్టాండ్, గెస్ట్‌హౌజ్‌లను తొలగించి కోట్ల రూపాయలు విలువచేసే భూమిని మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు. మార్కెటింగ్‌శాఖ ద్వారా అయినా ఆదాయం సమకూరుతుందా అంటే అదీ లేదు. దీనిమూలంగా కేవలం మాంసం విక్రయదారులు మాత్రమే సంతోషంగా ఉండగా... కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారులు అనుకున్న మేర వ్యాపారం జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ ప్రస్తుతం సమీకృత మార్కెట్ దుస్థితి.

గతంలో ఆగమైన వ్యాపారులు

గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ రోడ్డుతో పాటు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల రోడ్డు, ఫిష్ గల్లీలో దుస్తులు అమ్మేవారు, చెప్పులు కుట్టేవారు.. ఇతరత్రా చిన్నచిన్న వ్యాపారులు రోడ్లపైనే తమ వ్యాపారాలను చేసుకుంటూ ఉపాధి పొందేవారు. మార్కెట్ ఏర్పాటు సమయంలో వారిని వ్యాపారాలు కొనసాగించవద్దని ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఇతర అధికారుల సహకారంతో వ్యాపారాలను తొలగింపజేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో వ్యాపారులు మిన్నకుండిపోయారు. ఈ క్రమంలోనే వారి బతుకులు ఆగమయ్యాయి. అనేకమార్లు సదరు చిరువ్యాపారులు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. వాస్తవానికి చిరు వ్యాపారాలను తీయించే హక్కు ఏ అధికారికీ లేదు. ఈ విషయం తెలియని చిరువ్యాపారులు ఏమీ చేయలేకపోయారు. వారికి అవగాహన కల్పించే దిశగా అధికార, ప్రతిపక్ష నాయకుడు చొరవ చూపలేదు.

మూడువైపులా మడిగెలు నిర్మించే అవకాశం...

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మూడు ప్రధాన రోడ్ల మధ్యలో నిర్మించిన సమీకృత మార్కెట్ డిజైన్‌కు ప్రాముఖ్యత ఇస్తే కేవలం ఒకరోడ్డు వైపు డిజైన్ ఏర్పాటు చేసి మిగతా రోడ్లలో మడిగెలను ఏర్పాటు చేసినట్లయితే కొన్ని కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. అలాగే గతంలో మార్కెట్ ఏర్పాటు చేసిన సమయంలో ఆగమైన మోచీలు, చిరువ్యాపారులకు మడిగెలు తక్కువ ధరకు లభించేవి. ఫిష్ గల్లీలో మడిగెలు నిర్మించి లోపలి వైపు మార్కెటింగ్‌శాఖ, బయటి వైపునకు మునిసిపాలిటీకి ఇచ్చి ఉంటే ఇరు శాఖలకు ఆర్థిక వనరులు సమకూరేవి. దీంతో ఇటు మునిసిపాలిటీలో, అటు మార్కెటింగ్‌శాఖలో అభివృద్ధి చేపట్టే అవకాశం ఉండేది. మార్కెటింగ్‌శాఖకు మెయింటెనెన్స్ అప్పగించడంతో వ్యవసాయ మార్కెట్‌లో వచ్చిన ఆదాయాన్ని సమీకృత మార్కెట్‌లో వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఈ ఆలోచన చేసేవారు లేకపోవడంతో కేవలం ఉత్సవ విగ్రహంగా సమీకృత మార్కెట్ మిగిలిపోయింది.

చిరువ్యాపారులకు భంగం కలిగించే హక్కు లేదు

చిరు వ్యాపారుల వ్యాపారాలకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదని తెలుస్తున్నది. వాస్తవానికి కూరగాయల మార్కెట్ విక్రయదారులంతా సంఘంగా ఏర్పడి స్ట్రీట్ వెండార్స్ నిషేధ రోడ్డుగా మునిసిపాలిటీతో ప్రకటింపజేస్తే తప్ప వారి వ్యాపారాలకు భంగం కలిగించొద్దని చట్టం చెబుతున్నది. అయినా అధికారులు ఈ విషయాన్ని దాచిపెట్టి చిరువ్యాపారుల పొట్టపై కొట్టారు. ఈ రోడ్డులో దాదాపుగా 140మందికి పైగా చిరు వ్యాపారులు ఉపాధి పొందేవారు.

మహతి ఆడిటోరియం పరిస్థితి ఇంతే

గజ్వేల్ పట్టణంలో హంగు, ఆర్భాటాలతో రవీంద్రభారతికి దీటుగా ఏర్పాటుచేసిన మహతి ఆడిటోరియం మెయింటెనెన్స్‌ను టూరిజం శాఖకు అప్పగించారు. దీంతో ఈ ఆదాయం సైతం మునిసిపాలిటీకి రాకుండాపోయింది. వాస్తవానికి మునిసిపాలిటీకి ఇచ్చి ఉంటే మహతి ఆడిటోరియం ద్వారా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉండేది. ఇక మహతి ఆడిటోరియం పరిస్థితి గూర్చి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతానికి పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు ఆడిటోరియాన్ని ఇస్తున్నా.. పార్కింగ్ ప్రహసనంగా మారింది. మునిసిపాలిటీకి మెయింటెనెన్స్ ఇచ్చి ఉంటే మునిసిపల్ సిబ్బంది సహకారంతో ఎప్పటికప్పుడు అటు సమీకృత మార్కెట్, ఇటు మహతి ఆడిటోరియంను శుభ్రం చేయించి, ఆదాయాన్ని పొందే వీలు ఉండేది.

కులమతాలు వేరైనా.. మనమంతా భారతీయులం

- మత విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మత పెద్దలతో నిర్వహించిన శాంతి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి రూరల్, మార్చి 15: కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమనే విషయాన్ని మరువొద్దని, పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పలువురు మత పెద్దలతో శుక్రవారం నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ, ముస్లిం సోదరుల పవిత్రమాసం రంజాన్, గుడ్ ఫ్రైడే, హోలీ పండుగలు ఏకకాలంలో వస్తున్నందున జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా వివిధ మతాలకు చెందిన వారు ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే మత సామరస్యం నెలకొంటుందని అన్నారు. ఎలాంటి గొడవలకు ఆస్కారం ఇవ్వకుండా కుల మతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని సూచించారు. సంఘవిద్రోహ శక్తులు ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజల శ్రేయస్సు కోసం పోలీసుశాఖ అహర్నిశలు కృషి చేస్తున్నదని, పోలీస్‌శాఖకు మీ వంతు సహకారం అవసరమని, దానికి సబ్ డివిజన్ల వారీగా పీస్ కమిటీ, మైత్రీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అత్యవసర, సమయంలో డయల్ 100కు కాల్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐలు, పలువురు మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

- 130 గ్రాముల గంజాయి ప్యాకెట్, బైక్, రెండు ఫోన్లు స్వాధీనం

వర్గల్, మార్చి 15: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గౌరారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్, బైక్, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. వర్గల్ గ్రామానికి చెందిన దిండి శివానంద్‌గౌడ్, చెన్నకిష్టి సాయికిరణ్ ముదిరాజ్ మండలంలోని అవుసలోనిపల్లి గ్రామపంచాయతీ పరిధి, నగరంతండా సమీపంలోని పల్లె ప్రకృతివనం వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. గౌరారం ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం అక్కడికి వెళ్లి ఇద్దరిని విచారించారు. ఈ క్రమంలో బైక్ టూల్ బాక్సులో ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను తనిఖీ చేయగా గంజాయి లభించింది. వీరు కొంతకాలంగా హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో నివాసముంటున్న నీతూభాయి వద్ద గంజాయి కొనుగోలు చేసి వారు సేవించడంతో పాటు మిగిలిన దానిని వర్గల్‌తో పాటు పరిసర గ్రామాల యువకులకు, కూలీలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్, బైక్, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎవరైనా గంజాయి అమ్మినట్లు తెలిస్తే 8712667336, 8712667340 నెంబర్లకు ఫోన్‌చేసి తెలపాలని సీఐ కోరారు.

భూ వివాదంలో ఘర్షణ, నలుగురిపై కేసు

శివ్వంపేట, మార్చి 15: భూ వివాదం ఘర్షణలో ఒకరిపై ఒకరు దాడిచేసుకోగా ఇరువర్గాలకు చెందిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి గ్రామంలో సర్వే నెంబరు 416లో ఇరువర్గాల మధ్య 15 రోజులుగా భూ వివాదం నేపథ్యంలో ఘర్షణ చోటు చేసుకుంటున్నది. కాగా శుక్రవారం ఇరువర్గాలకు చెందినవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఘర్షణ పడుతున్న సంతోష్, షేక్‌అలీ, ఖాదర్, వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఐఐటీహెచ్‌ను సందర్శించిన జపాన్ పారిశ్రామికవేత్తల బృందం

- ఉన్నత విద్యలో ద్వైపాక్షిక సంబంధాలు
- పరిశోధన, విజ్ఞాన మార్పిడికి పరస్పర సహకారం



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో జపాన్ పారిశ్రామికవేత్తల బృందం

కంది, మార్చి 15: సాంకేతిక, వ్యవస్థాపక వాతావరణాన్ని అంచనా వేయడానికి అలాగే భారతదేశ విద్యార్థుల ప్రతిభను పెంపొందించే దిశగా జపాన్ పారిశ్రామికవేత్తల బృందం శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌ను సందర్శించింది. ఐఐటీహెచ్‌లో విద్యావిధానం, బోధనా పద్ధతులు, నూతన పరిశోధనలు, వర్క్‌షాపులను పరిశీలించిన బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. 26 మందితో కూడిన బృందం సభ్యులు జపాన్‌తో భారతదేశం లోతైన సంబంధాలను ప్రశంసించింది. వ్యాపార అభివృద్ధిని విస్తరించడానికి, జపనీస్ సంస్థలలో భారతీయ విద్యార్థులను నియమించుకోవడానికి ఈ బృందం ఆసక్తిని కనబరిచింది. అంతర్జాతీయ సహకారాలు, ఇన్‌స్టిట్యూట్‌లో భారతదేశం-జపాన్ సహకార ప్రయత్నాలతో మరింత మంది భారతీయ ప్రతిభావంతులను నియమించుకోవడానికి ఈ సందర్శన ఒక వేదికగా మారిందని జపాన్ ప్రతినిధుల బృందం తెలిపింది. పరిశోధనలు, విజ్ఞాన మార్పిడి కోసం ఐఐటీహెచ్‌తో పరస్పర సహకారంపై ఐఐటీహెచ్ ప్రొఫెసర్లతో చర్చించారు. అందులో భాగంగా ప్యాకల్టీ, విద్యార్థుల మార్పిడితో పాటు జాయింట్ సూపర్‌విజన్, జాయింట్ డిగ్రీలపై పరస్పరం సహరించుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్ పరిశోధకులు ప్రపంచవాప్తంగా విస్తరించారన్నారు. జపాన్ సహకారంతో ఉమ్మడి పరిశోధనలకు ప్రతిపాదనలు జరపుతున్నామని పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో జాయింట్ డాక్టోరల్ ప్రోగ్రాంలపై దృష్టి సారిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఐఐటీహెచ్ అంతర్జాతీయ విద్యా వ్యూహాలు, ప్రోగ్రామ్‌ల సేవల రూపకల్పనలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తున్నదని బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.

ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌కు గురుకుల విద్యార్థిని ఎంపిక



ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌కు ఎంపికైన శిల్పారాణిని అభినందిస్తున్న అధ్యాపకులు

మునిపల్లి, మార్చి 15: మండలంలోని బుదేరా చౌరస్తాలో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న శిల్పారాణి ఆలిండియా యూనివర్సిటీ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ (మహిళలు) 2023-24కు ఎంపికైనట్లు కళాశాల పీడీ రమాదేవి తెలిపారు. ఈ పోటీలు పంజాబ్ రాష్ట్రంలోని గురునానక్‌దేవి యూనివర్సిటీలో 19 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిల్పారాణిని ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసిన్ ఆరా, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు అభినందించారు.

పాడి రైతు కుదేలు

- మూడు బిల్లులు పెండింగ్‌లో..
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- ఏడువేల మంది పాడి రైతులకు తప్పని కష్టాలు



బిల్లులు చెల్లించాలని గజ్వేల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు(ఫైల్)

గజ్వేల్‌టౌన్, మార్చి 15: ప్రతీ పక్షం రోజులకు ఒకసారి అందాల్సిన పాల బిల్లులు మూడు నెలలు గడుస్తున్నా అందకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట జిల్లాలో ఏడువేల మంది పాడి రైతులు ప్రతిరోజూ 30 వేలకు పైగా లీటర్లను విజయ డెయిరీలో పోస్తారు. ప్రతిరోజూ రూ.15 లక్షల బిల్లు వస్తుండగా.. 15 రోజులకు రూ.2 కోట్లకు పైగా బిల్లు అవుతున్నది. ఇప్పటివరకు రూ.6 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మూడునెలల నుంచి పాలు పోస్తున్నా.. బిల్లులు రావడం లేదు. ఇటీవల జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిగుల్ గ్రామానికి చెందిన 60 మంది పాడి రైతులు బిల్లులు చెల్లించాలని గజ్వేల్ విజయ డెయిరీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

మూడు నెలల బిల్లులు రావాలి

మూడు నెలల నుంచి పాల బిల్లులు రావడం లేదు. దీంతో పశువుల పోషణ భారంగా మారింది. అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి పాల బిల్లు, ప్రోత్సాహం అందించాలి.

- ఐలయ్య, పాడి రైతు, తిగుల్

అక్రమ నిర్మాణాలపై కొరడా

- మాదారంలో 15 నిర్మాణాల నేలమట్టం
- అడ్డుకున్న స్థానికులు, నాయకులు
- పోలీసు పహారాలో కొనసాగిన కూల్చివేతలు



మాదారంలో అసైన్డ్ భూముల్లో నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

జిన్నారం, మార్చి 15: మండలంలోని మాదారంలో ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో నిర్మించిన కట్టడాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. 15 భారీ నిర్మాణాలను నేలమట్టం చేశారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకోవటంతో ఉద్రిక్తత నెలకొన్నది. జిన్నారం, బొల్లారం సీఐల ఆధ్వర్యంలో పోలీసు పహారా మధ్య, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఆక్రమణలను కూల్చివేయించారు. మాదారంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పలు నిర్మాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, ఇతర రెవెన్యూ అధికారులు మూడు ఎక్స్‌కవేటర్లతో సహాయంతో కూల్చివేతలను చేపట్టారు. కూల్చివేతలను స్థానికులు, నాయకులు అడ్డుకున్నారు. పేదలు నిర్మించుకున్న నివాసాలను కూల్చివేయటం తగదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ఆక్రమణలపై అందిన ఫిర్యాదుల మేరకు ఆయా నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానికులు అడ్డుకోవటంతో జిన్నారం, బొల్లారం సీఐలు సుదీర్‌కుమార్, గంగాదర్ సిబ్బంది స్థానికులను నిలువరించారు. 4 గంటల పాటు మాదారంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా కొడకంచి, కిష్టారెడ్డిపేటకు వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న పలు నిర్మాణాల కూల్చివేత కొనసాగింది.

అధికార విపక్ష పార్టీల మధ్య ఆరోపణలు

మాదారంలో కేవలం బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారి కట్టడాలనే కూల్చి వేశారని, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాసాల జోలికి వెళ్లలేదని, అధికారులు వారికి రక్షణగా ఉన్నారని గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆరోపించారు. తమ వారసత్వంగా వచ్చిన భూముల్లో నిర్మాణాలు జరిపినా ఆక్రమణలని కూల్చివేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల జిన్నారం మండలంలోని కాజీపల్లి, మాదారం పరిధిలో తరచూ ఆక్రమణల కూల్చివేతలు, అధికారుల దాడులకు మీరే కారణం అనేలా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుల మధ్య ఆరోపణలు జరుగుతున్నాయి. ఇటీవల ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసంతో మండల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కగా.. ప్రత్యర్థుల టార్గెట్‌గానే కూల్చివేతలు జరుగుతున్నాయనే చర్చ జరుగుతుంది.

పాఠశాలల నిర్వహణ బాధ్యత ఇక మహిళలకే..

నంగునూరు, మార్చి 15: అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ మహిళా సంఘాలకే అప్పగిస్తున్నట్లు మండల విద్యాధికారి దేశిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్ర మైన నంగునూరులోని మండల సమైఖ్య కార్యాలయంలో పాఠశాలల నిర్వహణపై మహిళలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడులను బలోపేతం చేసేందుకే వాటి నిర్వహణ మహిళకే ఇస్తున్నదని అన్నారు. ఇక నుంచి పాఠశాల కమిటీకి చైర్మన్‌గా వీవో అధ్యక్షులు, పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా, వీరితో పాటు ఒక క్లాసుకు ముగ్గురు సభ్యుల చొప్పున పదిహేను మంది కమిటీలో ఉంటారని తెలిపారు. ఏపీఎం ఆంజనేయులు మాట్లాడుతూ.. స్కూల్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను ప్రభుత్వం మహిళలకే అప్పగిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్, పీఆర్‌ఏఈ శశాంక్ ,సీసీలు లింగం, శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు ఆయా గ్రామాల వీవో అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అవగాహన కార్యక్రమాన్ని ఐకేపీ ఏపీఎం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళల పాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, పీఆర్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, వీఓఏలు, ఎంఎస్ పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పన, నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు నిర్వహిస్తాయని ఎంపీడీవో వెంకట లక్ష్మీ అన్నారు.శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బండి నర్సవ్వ, ఏపీఎం కిషన్, సీసీలు, బాల్‌రాజు, రాజేష్, సునీత, ఆయా గ్రామాల వీవోలు పాల్గొన్నారు.

● **ములుగు:** పాఠశాలల అభివృద్ధి కోసం అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు కృషి చేయాలని పీవీఎస్ ఆర్‌కే శర్మ అన్నారు. శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఏపీఎం యాదగిరి ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో నరసింహారావు, ఎంఈవో ఉదయభాస్కర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

●**దుబ్బాక:** దుబ్బాకలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో ఎంపీవో నూరందర్‌రెడ్డి, స్కూల్ నోడల్ అధికారి చక్రపాణి, ఏపీఎం కనకయ్య, మహిళా సమైఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **రాయపోల్:** మండలంలోని మహిళాసంఘ సభ్యులకు అమ్మ ఆదర్శ కమిటీలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలయ్య, ఎంపీవో లక్ష్మీనారాయణ, ఎంఈవో నరసమ్మ, ఏపీఎం దుర్గయ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

● **మద్దూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర మౌళిక వసతుల నిర్వహణకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు ప్రాధాన్యత కల్పిస్తుందని జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మద్దూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్. రాంమోహన్ అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటుకు మహిళా సంఘాల సభ్యులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం బాబూరావు, పీఆర్‌ఏఈ వినయ్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో జనార్దన్ అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై వీవో అధ్యక్షురాళ్లకు, వీవోఏలకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం కరుణాకర్, ఎంపీవో సోమిరెడ్డి. ఏపీఎం మహిపాల్, పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మం, సీసీలు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీరాములు అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ సమావేశం మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యాక్రమంలో మండల విద్యాధికారి యాదవరెడ్డి,పంచాయితీ రాజ్ ఏఈ వెంకటేష్, ఎపిఎం ధర్మసాగర్, ఎంపీపీ ఉపాధ్యాక్షులు సంతోష్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.



నంగనూరు: మాట్లాడుతున్న ఎంఈవో దేశిరెడ్డి



మిరుదొడ్డిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో



దౌల్తాబాద్‌లో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీవో వెంకటలక్ష్మి



నారాయణరావుపేటలో శిక్షణ కార్యక్రమానికి హాజరైన మహిళలు



మహిళను పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్థులు

పిల్లలను ఎత్తుకెళ్తుందనే అనుమానం

● మహిళను పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

మిరుదొడ్డి, మార్చి 15: ఓ మహిళ పిల్లలను ఎత్తుకెళ్లడానికి వచ్చిందన్న అనుమానంతో మిరుదొడ్డి గ్రామస్థులు ఆమెను పోలీసులకు అప్పగించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు చెందిన బలసంత యాదమ్మ భర్త ముత్తయ్యతో గొడవపడి తల్లిగారి ఊరైన గుడికందులకు బయలుదేరింది. అప్పటికే మద్యంమత్తులో ఉన్న యాదమ్మ మిరుదొడ్డిలో ఓ చిన్నపిల్లవాడిని పట్టుకున్నది. పిల్లలను ఎత్తుకెళ్లే మహిళగా అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హద్దులు నిర్ణయించడంలో సిబ్బంది నిర్లక్ష్యం



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కొండపాక, మార్చి 15: కొండపాక మండలం ఖమ్మంపల్లిలోని 1061 సర్వే నంబర్‌లోని ప్రభుత్వభూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఆర్డీవో ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఖమ్మంపల్లి ఎంపీటీసీ యాదగిరితో పాటు పలువురు గ్రామస్థులు ఆరోపించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారని పేర్కొన్నారు. అధికారులు సర్వే చేసి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయమై ప్రజాభవన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. సర్వే చేసి హద్దులు గుర్తించాలని ఆర్డీవో రెండు రోజుల క్రితం చెప్పినా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు.

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, మార్చి 15: గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్, దాచారంలో వాటర్ ట్యాంక్, బేగంపేటలో వాటర్ ట్యాంక్, బెజ్జంకిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. మండలంలోని గాగిల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు రావాలంటే భయపడుతున్నారని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కోరారు. పాఠశాలలో మూత్రశాలలు లేక విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కవిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, పులి కృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య సంతోష్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాగిల్లాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 15 : నియోజకవర్గంలో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని, సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారు తూర్పు గుంటూరుపల్లి దారిలోని వైకుంఠధామానికి వెళ్లేమార్గంతో పాటు పలు వార్డులలో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నానని, మౌలికవసతుల కల్పనకు రూ.35కోట్లు మంజూరు చేయించానన్నారు. కానీ తనపై ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, పనులు ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. ప్రొటోకాల్ విస్మరించడంలో చూపెడుతున్న శ్రద్ధ నియోజకవర్గ రైతుల కష్టాలు తీర్చేందుకు గోదావరి జలాలు చెరువులలోకి మళ్లింపచేయడంలో చూపాలని హితవు పలికారు. అనంతరం ఇటీవల అస్వస్థతకు గురైన బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పాస్టర్ మోజెస్‌లతో పాటు ఇటీవల భర్తను కోల్పోయిన ముస్త్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు పెద్దింటి కౌసల్యను పరామర్శించారు. ఆయా కార్యక్రమాలలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చి మడ్ల సతీశ్, వైశ్య సంఘం నాయకులు, ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.



వైకుంఠధామానికి వెళ్లేదారిలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం

● కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్

నారాయణరావుపేట, మార్చి 15: గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులతో పనులు ప్రారంభిస్తే బీజేపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్ ఆరోపించారు. శుక్రవారం నారాయణరావుపేటలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నారాయణరావుపేట గ్రామాభివృద్ధికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ముదిరాజ్ ఫంక్షన్‌హాల్ వద్ద సీసీ పనుల ప్రారంభోత్సవంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఏఈ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావుతో కలిసి కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పాల్గొన్నారన్నారు. బీజేపీ నాయకులు పని కల్పించుకుని అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గ్రామం మీద ప్రేమ ఉంటే సానుకూలంగా స్పందించడం నేర్చుకోవాలని, లేదంటే బీజేపీ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ ముదిరాజ్, గ్రామశాఖ అధ్యక్షుడు బిట్ల శ్రీనివాస్, నాయకులు కైలాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, మార్చి 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులోని మజీద్ పక్కన గల వీధిలో కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమర్‌తో కలిసి సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయనవెంట కమిషనర్ గొల్కొండ నరసయ్య, నాయకులు నాగరాజు, గణేశ్, చంద్రశేఖర్, మామిడి సురేశ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సాజిద్, సాయి, మహేశ్, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సిబ్బంది సల్ల స్వామి గుండెపోటుతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కుకునూరుపల్లి : బొబ్బాయపల్లి మదిర గ్రామమైన రాముని పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ ఐలమ్ యాదవ్, రవీందర్, ఉపేందర్, రవి, సందీప్, రమేష్, రాజు, సత్తయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లి భూ బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



కలెక్టర్ మనుచౌదరికి సమస్యలను వివరిస్తున్న మిట్టపల్లి గ్రామప్రజలు, పూజల హరికృష్ణ

సిద్దిపేటటౌన్, మార్చి 15: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో నిర్మిస్తున్న రైల్వేబ్రిడ్జిలో భూములు కోల్పోతున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ హామీనిచ్చారు. శుక్రవారం సిద్దిపేటలో కలెక్టరేట్‌లో మిట్టపల్లి భూబాధితులతో కలిసి పూజల హరికృష్ణ సమస్యను కలెక్టర్ మనుచౌదరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ మిట్టపల్లిలో నిర్మిస్తున్న రైల్వేబ్రిడ్జి పనులు ఇప్పటివరకు ఏ మేరకు అయితే చేపట్టారో అంతవరకే నిర్మించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు చెప్పినట్లు తెలిపారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులే రీడిజైన్ చేసి నిర్మిస్తున్నారని, మిట్టపల్లిలో చేపడుతున్న రైల్వేబ్రిడ్జిపై విషయంలో గ్రామస్థులు నష్టపోకుండా ఉండేందుకు త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన చెప్పారు. త్వరలోనే కలెక్టర్‌తో కలిసి మిట్టపల్లిలో చేపడుతున్న రైల్వే బ్రిడ్జిని సందర్శిస్తామని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు, రాజ్ బహదూర్ పలువురు ఉన్నారు.

హెచ్‌పీఎస్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 15: జిల్లాలోని విద్యార్థుల కోసం హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతపూర్‌లో మొదటి తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రవేశం కోసం ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. 15 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో కలెక్టర్ మను చౌదరి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో డ్రా తీసి ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి ఫిరంగి, పాల్గొన్నారు.

వాయిదా పడిన మండల సర్వసభ్య సమావేశం

కొండపాక, మార్చి 15 : కొండపాక మండల సర్వసభ్య సమావేశం సభ్యులు రాకపోవడంతో వాయిదా పడింది. శుక్రవారం సమావేశం జరగాల్సి ఉండగా ఒక్క సభ్యుడు కూడా సమావేశానికి రాకపోవడంతో కొంత సమయం వేచి చూసి సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ బాబు నాయక్, ఎంపీవో, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చేర్యాల, మార్చి 15 : అనుమతులు లేకుండా అక్రమంగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మూడు ఇసుకట్రాక్టర్లను చేర్యాల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని చేర్యాల ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

అల్పాహార పథకాన్ని కొనసాగించాలి

మిరుదొడ్డి,వమార్చి15: రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకాన్ని కొనసాగించాలని శుక్రవారం హైద్రాబాద్‌లో తెలంగాణ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

చేర్యాలకు ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్

చేర్యాల, మార్చి 15 : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ జి.నర్సయ్యను చేర్యాల మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. ఈమేరకు శుక్రవారం సీడీఎంఏ డైరెక్టర్ డి. దివ్య ఉత్తర్వులు జారీ చేశారు.

కాన్షీరామ్ జయంతి

మిరుదొడ్డి,మార్చి15: మండల కేంద్రంలో శుక్రవారం కాన్షీరామ్ జయంతిని ధర్మసమాజ్‌పార్టీ మండల అధ్యక్షుడు దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులర్పించారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

మద్దూరు/దూళిమిట్ట మార్చి 15 : ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఉమ్మడి మండలంలోని మద్దూరు, వల్లంపట్ల, బైరాన్‌పల్లి, మర్మాముల గ్రామాల్లో పర్యటించి ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ, ఏఈవోలు రాకేష్, అఖిల్, కల్పన, రాధిక, అనూష ఉన్నారు. దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఫర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రయ విక్రయాలను నమోదు చేసి, రైతులకు రసీదు ఇవ్వాలని ఆదేశించారు.

'మన సంప్రదాయంలో తల్లికి విశిష్ట స్థానం'



మాతృ వందనం చేస్తున్న విద్యార్థులు

కొండపాక, మార్చి 15 : మన సంప్రదాయంలో తల్లికి విశిష్ట స్థానం ఉందని కొండపాక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విటల్‌నాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో మాతృ వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు తమ మాతృమూర్తులకు వందనం చేసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి ఆశీర్వాదంతో ఏ పని మొదలుపెట్టిన విజయవంతమవుతుందని పేర్కొన్నాడు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, రామస్వామి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాల మల్లయ్య, పాల్గొన్నారు.

నిధుల మంజూరు పట్ల హర్షం

బెజ్జంకి, మార్చి 15: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రోడ్ల నిర్మాణానికి సీఆర్‌ఐఎఫ్ నిధుల కింద నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ చిత్రపటాలకు బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొలిపాక రాజు మాట్లాడుతూ.. కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి కింద తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని 31 రోడ్ల నిర్మాణ పనులకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి కమల్ ప్రకాష్ 850 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్వేద మహిపాల్ రెడ్డి, అనిల్ రావు, మహేందర్, మల్లేశం, రాజు, రవి, తదితరలు పాల్గొన్నారు.

పోటీలో గెలుపోటములు సహజం

● తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ బీ. నీరజ ప్రభాకర్

ములుగు, మార్చి 15: పోటీలలో గెలుపోటములు సహజమని, అందులో ఉన్న క్రీడా స్ఫూర్తిని మాత్రమే విద్యార్థులు తీసుకోవాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విద్యాలయం వైస్ చాన్సలర్ బీ. నీరజా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరర్ సైన్స్, అటవీ కళాశాల, పరిశోధన సంస్థతో కలిసి నిర్వహిస్తున్న 3వ అంతర కళాశాల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల విజయానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆమె తెలిపారు. ఈ క్రీడలు 15వ తేదీన ప్రారంభమై 17వ తేదీ వరకు, మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ పోటీలలో ములుగులోని ఉద్యానవన, అటవీ కళాశాల విద్యార్థులతో పాటు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లాలోని మేజర్ల, మహబూబాబాద్ జిల్లాలోని మల్యాల ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఉద్యానవన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎం. రాజశేఖర్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ డి. విజయ, అటవీ కళాశాల, పరిశోధన సంస్థ అసోసియేట్ డిన్ ఎ. వెంకటేశ్వర్లు, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్లు డాక్టర్ పి. ప్రశాంత్, డాక్టర్ జే. చీనా, డాక్టర్ పి. సైదయ్య పాల్గొన్నారు.



అటవీ కళాశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ నీరజ ప్రభాకర్

అభివృద్ధి పనులకు భూమి పూజలు

కోహెడ, మార్చి 15 : మండలంలోని 12 గ్రామాలకు వివిధ అభివృద్ధి పనులకు రూ. 27లక్షలు ఎంపీ ల్యాండ్స్ నిధులు మంజూరు కావడంతో శుక్రవారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గురువారం మంజూరు పత్రాలను బీజేపీ నాయకులకు అందజేయడంతో, ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో రాత్రికి రాత్రే గ్రామాల్లో ప్రోసిడింగ్ ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూల విజయబాలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు చేను తిరుపతి, మండల కార్యదర్శి గాజుల వేంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, సుధీర్, రజక సంఘం నాయకులు ఉప్పరపల్లి రాజు, శ్రీనివాస్, కొమురయ్య, రవి, సారయ్య, అన్నాడి మధుసూదన్ రెడ్డి, జీజేపీశ్రేణులు ధ్యాగటి శ్రీనివాస్, విశ్వనాథం రాజయ్య, చేను సంపత్, మాటేటి వేణు తదితరున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్గల్, మార్చి 15 : వైశ్య కార్పొరేషన్ ప్రకటించడంతో శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైశ్య సంఘం నాయకులు మహాత్మ గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చిత్రపటాలకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటయ్య గుప్త, మాజీ అధ్యక్షుడు విశ్వనాథం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభుగౌడ్, నాయకులు ముత్యాలు, ప్రవీన్‌గౌడ్, వైశ్య సంఘం నాయకులు బాలేష్ గుప్త, మోహన్, రాజేశ్వర్, శ్రీనివాస్, లచ్చలు, రమేశ్, విశ్వప్రసాద్, బద్రినాథ్, తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నాయిని నర్సింహారెడ్డి

నారాయణరావుపేట,మార్చి15: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు బర్మ రామచంద్రం ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస నాయకులు కాంగెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సేవాదల్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, కాంగెస్ పార్టీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి బాబేష్ తదితరుల పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణగా గ్రామదేవతలు

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

వర్గల్, మార్చి 15 : ప్రజలకు రక్షణగా గ్రామదేవతలు ఉంటారని, గ్రామదేవతల అనుగ్రహంతోనే ప్రజలు సంతోషంగా ఉంటారని రాష్ట్ర అటవి అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం సింగాయిపల్లిలో బొడ్రాయి, గండిమైసమ్మ, మాతమ్మ విగ్రాహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయాలకు మహర్దశ లభించిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

దుబ్బాక,మార్చి15: ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటిలోని చెల్లాపూర్ రెండోవార్డులోని ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మాణానికి భూమి పూజ చేశారు.

సిద్దిపేట మున్సిపాలిటీ రాష్ట్రానికే ఆదర్శం

● సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట టౌన్, మార్చి15: సిద్దిపేట మున్సిపాలిటీ రాష్ట్రానికే ఆదర్శమని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో నీతి ఆయోగ్ భాగస్వామ్యంతో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్, చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, కాకతీయ సాండ్ బాక్స్, బాల వికాసల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో చెప్పటిన ఐదు రోజుల ఇన్నోవేషన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట మున్సిపాలిటీలో చేపట్టిన స్వచ్ఛ బడిని రాష్ట్రములోని ఎన్నో మున్సిపాలిటీలు ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గోపాలపురం దీప్తినాగరాజు, ఏసీఐసీ సీఈవో ఆనీ, కాకతీయ సాండ్ బాక్స్ ప్రతినిధి ఇబాద్, టీఎస్ఐసీ అధికారి రమేష్, నవం ఫౌండేషన్ ప్రతినిధి శ్రావణ్, బాల వికాస ప్రతినిధులు, సీబీఐటీ, ఎంజీఐటీ, కేజీరెడ్డి, ఎస్ఆర్ఎమ్ ఇంజనీరింగ్ కాలేజ్, రత్నపురీ డిప్లమా కాలేజ్ విద్యార్థులు, సిద్దిపేట మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ వనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్